## ఆరు గ్యారెంటీల సవరణల కేంద్రాల ఏర్పాటు

బల్దియా ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద బారులు తీరిన జనం

వరంగల్, జూన్ 22 : కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారెంటీల దరఖాస్తుల సవరణల కోసం కార్పొరేషన్ పరిధిలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. జీరో కరెంట్ బిల్లు, గ్యాస్ సబ్సిడీ చాలా మందికి అందక పోవడంతో కొన్ని నెలలుగా కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ జనం తిరుగుతున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో శనివారం నుంచి కార్పోరేషన్ పరిధిలోని వార్డు కార్యాలయాల్లో సవరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రం వద్ద ప్రజలు బారులు తీరారు.

## రెండు రోజులు తాగునీటి సరఫరా బంద్

వరంగల్, జూన్ 22 : దేశాయిపేట ప్రతాపరుద్ర ఫిల్టర్‌బెడ్ పరిధిలో పైప్‌లైన్ మరమ్మతులు జరుగుతున్న నేపథ్యంలో వరంగల్ ప్రాంతంలో రెండు రోజుల పాటు తాగునీటి సరఫరా నిలుపివేస్తున్నట్లు బల్దియా ఈఈ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. దేశాయిపేట, కొత్తవాడ, ఆటోనగర్, ఎల్‌బీ నగర్, పోచమ్మమైదాన్, కాశీబుగ్గ, కంటి దవాఖాన, ఎంజీఎం ఆస్పత్రి ఏరియా, కేఎంసీ, మట్టెవాడ, వరంగల్ చౌరస్తా, బట్టల బజార్, సంతోషిమాత కాలనీ, హంటర్‌రోడ్, చార్‌బౌళీ, గోవిందరాజుల స్వామి గుట్ట, క్రిస్టియన్ కాలనీ, లేబర్‌కాలనీ, ఎస్ఆర్‌టీ కాలనీ, ఎనుమాముల, ఆరెపల్లి, కొత్తపేట, గొర్రెకుంట, కీర్తినగర్, పైడిపల్లి, మొగిలిచర్ల, ధర్మారం ప్రాంతాల్లో రెండు రోజులు తాగునీటి సరఫరా ఉండద, ప్రజలు సహకరించాలని కోరారు.

## పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం

ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ప్రిన్సిపాల్

హనుమకొండ చౌరస్తా, జూన్ 22 : డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ ప్రక్రియ వరంగల్ ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కాలేజీలో శనివారం నుంచి ప్రారంభమైంది. ఈ నెల 25వ తేదీ వరకు సర్టిఫికెట్ల ధ్రువీకరణ జరుగుతుందని ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ తెలిపారు. ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు విద్యార్థులు tgpolycet.nic.inలో ఆప్షన్స్ ఇచ్చుకోవచ్చని, వీరికి 30న సీట్లు కేటాయిస్తామన్నారు. సీట్ పొందిన విద్యార్థులు జూలై 4వ తేదీ వరకు వెబ్‌సైట్ ద్వారా ప్రవేశ రుసుం చెల్లించి సెల్ఫ్ రిపోర్టు చేయాలని చెప్పారు. విద్యార్థులు ఎస్ఎస్సీ, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ, టీసీ, ఆదాయం, ఈడబ్ల్యూఎస్ 2024-25 ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు ఒక కాపీ జిరాక్స్ సెట్‌నూ తమ వెంట తీసుకురావాల్సి ఉంటుందన్నారు. శుక్రవారం 480మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి వరంగల్ ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్‌కు వచ్చారని తెలిపారు.

## ఎస్సీ హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు, జూన్ 22 : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హాస్టల్ సంక్షేమ అధికారి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హాస్టల్‌లో 100 మంది విద్యార్థులను తీసుకుంటున్నామన్నారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఎస్సీ-70 సీట్లు, ఎస్టీ-5, బీసీ-9, ఓసీ-4, హెచ్‌సీ-12 ఖాళీలు ఉన్నాయన్నారు.

## ఎంపీ, ఎమ్మెల్యేను కలిసిన కళాకారుడు

సమ్మయ్యను సత్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

హనుమకొండ, జూన్ 22 : ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని చిందు యక్షగాన కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం హనుమకొండ కనకదుర్గ కాలనీలోని వారి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు గడ్డం సమ్మయ్యను సత్కరించారు. సమ్మయ్యకు పద్మశ్రీ అవార్డు రావడం జనగామ జిల్లాకే గర్వకారణమని, సమ్మయ్యకు అన్ని విధాల అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జనగామ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గాడిపెల్లి ప్రేమలత పాల్గొన్నారు.

KVB కరూర్ వైశ్యా బ్యాంక్ | వరంగల్ శాఖ, వరంగల్ జిల్లా.

నగల వేలం ప్రకటన

ఈ దిగువ తెలిపిన నగలను బ్యాంకు వారు బహిరంగ వేలం ద్వారా వేలం వేయ నిర్ణయించినారు. కావున తెలియజేయడమైనది.

| | |
|---|---|
| వేలం జరుగు స్థలము | : బి కరూర్ వైశ్యా బ్యాంకు లిమిటెడ్, వరంగల్ శాఖ, నిర్మలమాల్, జె.పి.యన్. రోడ్, వరంగల్. ఫోన్: 0870-2562149, |
| నగల తనిఖీ మరియు సమయము | : తేది. 05-07-2024 మ॥ 3 గం.ల నుండి 3.30 గం.ల వరకు (బ్యాంకు పనిదినములలో) |
| వేలం జరుగు తేది మరియు సమయం | : తేది. 05-07-2024 రోజున మ॥ 3.30 గం.లకు |

నగల తాలూకు వివరములు

| క్ర. సం. | ఋణ గ్రహీతల పేరు మరియు చిరునామా | ఖాతా నెం. | నగల వివరములు | స్థూల బరువు (గ్రాములలో) |
|---|---|---|---|---|
| 1. | శ్రీమతి సెట్టి మీన, ఇ.నెం. 45-10-37, కీర్తినగర్, గొర్రెకుంట, వరంగల్. | 1415951000004036 | హారం-1, బ్రాస్‌లెట్-2 | 41.900 |

ముఖ్య నియమ నిబంధనలు: 1) పైన తెలిపిన ఋణ గ్రహీతలకు గతంలో జారీచేసిన నోటీసులకు (అవి అందిననూ లేక ఏ కారణము చేతనైనను తిరిగి వచ్చినను) దీనినే ఆఖరి నోటీసుగా భావించవలసినది. 2) ఒకవేళ ఋణ గ్రహీత మరణించినచో వారి వారసులకు కూడా ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. 3) రూ. 10,000/- ధరావతును బ్యాంక్ వారిచే వేలం తేది మధ్యాహ్నం 2.00 గం.ల వరకు మాత్రమే స్వీకరించబడును. 4) విజయవంతమైన పాటదారుడు వేలం తేది సాయంత్రం 5.00 గం.లోగా ధరావతు మినహా మిగిలిన పాట మొత్తమును చెల్లించి నగలను స్వంత బాధ్యత వహించి పొందవలెను. 5) నగల నాణ్యతను పాటకు ముందుగానే పాటదారుడు సరిచూసుకోవలెను. అందుకు బ్యాంక్ బాధ్యత వహించజాలదు. 6) ఏవిధమైన ముందస్తు ప్రకటన లేకుండగనే వేలంను పాక్షికముగా గాని పూర్తిగా గానీ రద్దు చేయు అధికారము బ్యాంకుకు కలదు. 7) పాటదారుడు సరైన ఫోటో మరియు చిరునామా ఋజువులను ప్రాథమికముగా దాఖలు చేయుట తప్పనిసరి. 8) ఇతర పూర్తి నియమ నిబంధనల కొరకు ఈ దిగువ బ్రాంచి నందు సంప్రదించగలరు.

ఇట్లు : కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్, బ్రాంచి మేనేజర్, వరంగల్ బ్రాంచి, జె.పి.యన్. రోడ్, వరంగల్. ఫోన్: 0870-2562149

# డిగ్రీ కాలేజీలు నిబంధనలు పాటించాలి

- లేనిపక్షంలో రద్దు చేస్తాం
- పోర్టల్‌లో 197 కళాశాలల వివరాలు నమోదు
- ఇంకా మిగిలి ఉన్న 100 కాలేజీలు
- ప్రిన్సిపాళ్ల సమావేశంలో రిజిస్ట్రార్ మల్లారెడ్డి

ప్రిన్సిపాళ్ల సమావేశంలో మాట్లాడుతున్న కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి

హనుమకొండ చౌరస్తా, జూన్ 22 : కేయూ అనుబంధ డిగ్రీ కాలేజీలు బలోపేతం కావాలని, నిబంధనలు పాటించని కాలేజీల అనుబంధాన్ని రద్దు చేస్తామని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి హెచ్చరించారు. విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో అకడమిక్ ఆడిట్ డీన్ హనుమంతు అధ్యక్షతన వర్సిటీ పరిధిలోని వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లోని డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. నూతన కోర్సులు, సబ్జెక్ట్‌ల విషయంలో యూనివర్సిటీ అనుమతి అవసరమన్నారు. బోధన, శిక్షణ, పరిశోధనలపై దృష్టి పెట్టాలన్నారు. విశ్వవిద్యాలయం ఎంపిక చేసిన ప్రభుత్వ కాలేజీలను పరిశోధనా కేంద్రాలుగా అనుమతి మంజూరు అయిందన్నారు. అధ్యాపకుల కొరత, పరిమిత వనరులు ఉన్నప్పటికీ అనుకున్న సమయానికి పరీక్షల నిర్వహణ చేసినట్లు తెలిపారు. కాలేజీల ప్రిన్సిపాళ్ల సందేహాలు, సూచనలు పరిగణలోనికి తీసుకుంటామని, ప్రభుత్వ కాలేజీల బోధనా సిబ్బంది మూల్యాంకనంలో పాల్గొనాలన్నారు. విశ్వవిద్యాలయం పరిధిలో 297 కళాశాలలు ఉండగా కేవలం 197 కాలేజీల బోధనా సిబ్బంది వివరాలు సంబంధిత పోర్టల్‌లో నమోదు చేశారని, మిగతా 100 కాలేజీల మాటేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచి అకడమిక్ వాతావరణం కల్పించడంలో ఇరువర్గాలు కలిసి పని చేయాలని సూచించారు. అకడమిక్ ఆడిట్ డీన్ హనుమంతు మాట్లాడుతూ.. జూన్ 10వ తేదీ నుంచి డిగ్రీ 3, 5వ సెమిస్టర్ తరగతులు ప్రారంభమైనట్లు, దోస్త్ ప్రకారం మొదటి సెమిస్టర్ తరగతులు జూలై 1 నుంచి ప్రారంభమవుతాయన్నారు. పరీక్షల నియంత్రణాధికారి నరసింహాచారి మాట్లాడుతూ.. పరీక్షల నియమ నిబంధనలు విధిగా పాటించాలని, అంతర్గత, విశ్వవిద్యాలయం, ప్రయోగ పరీక్షలు కచ్చితంగా నిర్వహించాలన్నారు. 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షలు సమయానికి నిర్వహించగలిగామన్నారు. అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమల దేవి, అకడమిక్ విభాగ సహాయ రిజిస్ట్రార్ కోలా శంకర్, జాతీయ సేవా పథకం సమన్వయ అధికారి ఈసం నారాయణ, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి వెంకయ్య మాట్లాడారు.

**రిజిస్ట్రార్ దృష్టికి పలు సమస్యలు..**

ప్రిన్సిపాళ్లు పలు సమస్యలను రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లారు. ఐదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ ఉన్న విద్యార్థులకు సప్లిమెంటరీ నిర్వహించాలని, ప్రభుత్వ కళాశాలల్లో అతిథి అధ్యాపకులను నియమించాలని, జవాబు పత్రాలు యూనివర్సిటీకి పంపడానికి విధివిధానాలు ఉండాలని, ల్యాటరల్ ఎంట్రీ విద్యార్థుల హాల్ టికెట్‌లు పోర్టల్‌లో ఉంచాలని, పరీక్షల విధుల నిధులు పెంచాలని, కాలేజీ సిబ్బందికి అనుగుణంగా పరీక్షా కేంద్రాలు, విద్యార్థులను అలాట్ చేయాలని, మూల్యాంకన విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## 'గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల ఏర్పాటు చేయాలి'

హనుమకొండ చౌరస్తా, జూన్ 22 : స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్‌నాయక్‌కు హనుమకొండ గిరిజన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎల్‌హెచ్‌పీఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్, బీఆర్ఎస్వీ స్టేషన్ ఘనపూర్ ఇన్‌చార్జి లకావత్ చిరంజీవి, గిరిజన రిజర్వేషన్ పోరాట సమితి ఉపాధ్యక్షుడు బానోత్ భాస్కర్, నిట్ విద్యార్థి మాలోత్ నరేశ్ ఉన్నారు.

## 'జూనియర్ కాలేజీని మూసివేయాలి'

హనుమకొండ చౌరస్తా, జూన్ 22 : చింతగట్టులో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక బ్రాంచ్‌కి అనుమతి పొంది అదనంగా మరో రెండు బ్రాంచ్‌లు నడుపుతున్న కాళోజీ జూనియర్ కాలేజీని మూసివేయాలని డీఐఈవో గోపాల్‌కు స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ మాట్లాడుతూ.. కాలేజీలో ధోబీ, మెడికల్ ఫీజుల పేరుతో అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించడం లేదని, వెంటనే కాలేజీని మూసివేసి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. బహుజన సంఘం నాయకులు చెన్నూరి జీవన్, మొకినపల్లి మహేందర్ ఉన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

కాశీబుగ్గ, జూన్ 22: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిసి మార్కెట్ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆమె సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చాంబర్ మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య, సాగర్ల శ్రీనివాస్, ఎన్ రెడ్డి లింగారెడ్డి, చింతలపల్లి వీరారావు, కంభంపాటి శ్రీధర్ పాల్గొన్నారు.

## 120 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

పర్వతగిరి, జూన్ 22 : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని ఏబీతండా శివారు ఉట్టితండాలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు 120 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు. హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన పస్కం రమేశ్ చుట్టు పక్కల గ్రామాల్లో రేషన్ బియ్యం సేకరించి తండాలో డంపింగ్ చేశాడు. పోలీసుల తనిఖీల్లో 120 క్వింటాళ్ల బియ్యం బయటపడగా, స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బియ్యం విలువ రూ.3.12 లక్షలు ఉంటుందని, సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించినట్లు వెల్లడించారు.

## గిరిజన సంక్షేమానికి ఎస్టీ కమిషన్ కృషి

**జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్**

సమీక్షలో మాట్లాడుతున్న జాటోత్ హుస్సేన్ నాయక్

హనుమకొండ, జూన్ 22 : దేశంలోని గిరిజనుల సంక్షేమం కోసం ఎస్టీ కమిషన్ పని చేస్తుందని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, వెంకట్ రెడ్డితో కలిసి వైద్యం, ఆరోగ్యం, గిరిజన హాస్టల్స్ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంజీఎం దవాఖానలో రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని సూచించారు. ప్రభుత్వ దవాఖానల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. గిరిజన హాస్టళ్లలో దరఖాస్తు చేసుకునే విద్యార్థులందరికీ అవకాశం కల్పించాలని, అవసరమైతే సీట్లు, రూమ్‌ల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గిరిజన బంజారా భవన్లలో సౌకర్యాలను మెరుగు పర్చాలన్నారు. సమీక్షలో డీఎంహెచ్‌వో సాంబశివరావు, ఎంజీఎం దవాఖాన సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆర్డీవో వెంకటేశ్, కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్ దాస్, ప్రభుత్వ చాతీ హాస్పిటల్ ఇచ్‌చార్జి రవి, డాక్టర్ గౌతమ్, డీటీడీవో ప్రేమకళ, ఆర్సీవో డీఎస్ వెంకన్న, ఆర్ అండ్‌బీ డీఈ రాజు, హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల సూపరింటెండెంట్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

**ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి**

హనుమకొండ సబర్బన్ : ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డిని జాటోత్ హుస్సేన్ నాయక్ కోరారు. హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో విద్యుత్ శాఖ ఎస్టీ ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. ఎస్టీలకు అన్యాయం జరిగితే కమిషన్ సహించదన్నారు. ఎస్టీ ఉద్యోగులపై వివక్ష చూపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు సదర్‌లాల్, అశోక్‌కుమార్, మోహన్‌రావు, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్పీడీసీఎల్ అధ్యక్షుడు వాలూ నాయక్, ప్రధాన కార్యదర్శి అజ్మీరా శ్రీరాంనాయక్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న మహేందర్, విద్యార్థులు

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

హనుమకొండ చౌరస్తా, జూన్ 22 : కేయూ ఇంజినీరింగ్ కాలేజీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యత అని వైస్ ప్రిన్సిపాల్ విశాల మహేందర్ అన్నారు. శనివారం కాలేజీలో విద్యార్థులు, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందితో కలిసి ఆయన 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ నేతాజీ, సూపరింటెండెంట్ బొల్లిపాక ప్రభాకర్, లైబ్రేరియన్ సుజాత, సంగాల ఎఫ్రామ్‌రాజ్, సదాశివుడు, మహ్మద్ హున్నీస్, నర్మద, రాహుల్, పున్నంచందర్, ఆనంద్ పాల్గొన్నారు.

## 'సమాన విద్య, వైద్యం కోసం పోరాడుదాం'

హనుమకొండ చౌరస్తా, జూన్ 22 : సమాన విద్య, వైద్యం కోసం పోరాడుదామని డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్(డీఎస్ఏ) రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రంలోని సెమినార్ హాల్లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ కమిటీని ప్రకటించినట్లు తెలిపారు. డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్‌గా కామగోని శ్రావణ్ (మహబూబాబాద్), రాష్ట్ర కో-కన్వీనర్లుగా జిగర అనిల్(వరంగల్), మున్నా గణేశ్(సూర్యాపేట), ఉప్పుల శివ (హన్మకొండ), గుండాల రమేశ్(ఆదిలాబాద్)ను ప్రకటించారు. పవన్, శివ, నాగరాజు, అనిల్, శరత్, అభిషేక్, రవికుమార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ కాలేజీలో చేరాలని విద్యార్థుల ర్యాలీ

ర్యాలీ తీస్తున్న విద్యార్థులు, ప్రిన్సిపాల్

శాయంపేట, జూన్ 22 : ప్రభుత్వ కాలేజీలో చేరాలని శాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు శనివారం ర్యాలీ తీశారు. బస్టాండ్ సెంటర్ నుంచి బ్యానర్లు పట్టుకొని ప్రభుత్వ కాలేజీని కాపాడండి.. విద్యార్థులను కాలేజీలో చేర్పించండి అంటూ నినాదాలు చేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు హిమబిందు, శైలేందేర్, సునీల్‌కుమార్, వేణు, కల్పన, నర్సిరెడ్డి, సాయి పాల్గొన్నారు.

## ఐదుగురు పోలీసులకు సేవా పతకాలు

సుబేదారి, జూన్ 22 : వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఐదుగురు పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం సేవా పతకాలు ప్రకటించింది. వీరిలో హెడ్ కానిస్టేబుల్ టీ యాదగిరికి ఉత్తమ సేవా పతకం, సీఐ కే శ్రీధర్‌రావు, హెడ్ కానిస్టేబుళ్లు ఎండీ సాధిక్, ఎం భిక్షపతి, కానిస్టేబుల్ జీ శ్రీనివాస్‌కు సేవా పతకాలు లభించాయి.

## చెట్టుకు కారు ఢీకొని ఒకరికి గాయాలు

తాడ్వాయి, జూన్ 22 : కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొని ఒకరికి గాయాలైన ఘటన మండలంలోని లవ్వాల స్టేజీ వద్ద శనివారం జరిగింది. వరంగల్‌లోని మాంటిస్సోరి పాఠశాలలో పని చేస్తున్న భరత్‌కుమార్ కారులో ఏటూర్‌నాగారానికి బయలుదేరాడు. లవ్వాల స్టేజి వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టుకు ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆయనకు కాలు, చేయి విరిగాయి. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఆయనను దవాఖానకు తరలించారు.

## 'సఖీ' సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఐనవోలు, జూన్ 22 : ఆపదలో ఉన్న మహిళలు, యువతులు సఖీ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి సూచించారు. మండల కేంద్రంలో శనివారం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సఖీ కేంద్రం మహిళల కోసం 24 గంటలు పని చేస్తుందని తెలిపారు. బాల్యవివాహాలు, వరకట్న వేధింపులు, గృహ హింస, లైంగిక, శారీరక వేధింపులు, బాలల అక్రమ రవాణా, ఎలాంటి ఆధారం లేని వృద్ధులు, మహిళలు, బాలికలు ఉంటే హెల్ప్‌లైన్ నంబర్ 181 లేదా 0870 2452112కు ఫోన్ చేయాలని కోరారు. ఏపీఎం రాజ్‌కుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు యమున, ఓబీ సభ్యురాలు రేణుక, సీసీలు ప్రశాంత్, ఎల్లయ్య పాల్గొన్నారు.

## సత్వరమే ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల పనులు పూర్తి చేయాలి

**గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే**

పనులను పరిశీలిస్తున్న అశ్వినీ తానాజీ వాకడే

వరంగల్, జూన్ 22 : గ్రేటర్‌లోని ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శనివారం వరంగల్‌లోని పోతన నగర్, బాలసముద్రంలోని ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల సివిల్ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. త్వరగా పూర్తి చేసి వాటిని అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో రాజేశ్, ఈఈలు రాజయ్య, సంజయ్‌కుమార్, డీఈ రవికుమార్, ఏఈ సంతోష్, ఎస్ఐ శ్యామ్‌రాజ్ పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

**డిప్యూటీ డీఎంహెచ్‌వో యాకూబ్ పాషా**

రిజిస్టర్లను పరిశీలిస్తున్న యాకూబ్ పాషా

వరంగల్, జూన్ 22 : లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌వో యాకూబ్ పాషా హెచ్చరించారు. శనివారం ఆయన హనుమకొండలోని పలు దవాఖానలను తనిఖీ చేశారు. స్కానింగ్ చేసుకున్న వారి పేర్లు, వివరాలను నమోదు చేయాలన్నారు. ప్రసవం, అబార్షన్లు చేసుకున్న వారి వివరాలతో ఫామ్-ఎఫ్ రికార్డులు సక్రమంగా ఉండాలని ఆస్పత్రి యాజమాన్యాలకు సూచించారు. ప్రతి నెలా వివరాలను డీఎంహెచ్‌వో కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. సాధారణ ప్రసవాలను పెంచాలన్నారు. మాతాశిశు మృతి వివరాలను అందజేయాలన్నారు. డెమో అశోక్‌రెడ్డి, సీహెచ్‌వో మాధవరెడ్డి పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కృషి

దామెర, జూన్ 22 : మండలంలోని ల్యాదెళ్లలో సీజనల్ వ్యాధుల నివారణపై శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఎంపీపీ కాగితాల శంకర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో చెత్తసేకరణలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు. చెత్తాచెదారాన్ని జీపీ పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగిస్తే వ్యాధులు దరిచేరవన్నారు. మలేరియా, టైఫాయిడ్, కలరా వంటి వ్యాధుల నివారణకు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. హింగె శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కాజీపేటలో కంటి వైద్య శిబిరం

కాజీపేట, జూన్ 22 : కాజీపేటలోని రైల్వే రిటైర్డ్ పెన్షనర్స్ కార్యాలయంలో శనివారం శరత్ మాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో రైల్వే పెన్షనర్లకు కంటి వైద్య శిబిరం జరిగింది. దవాఖాన వైద్య సిబ్బంది 150 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు, అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ బ్రాంచ్ అధ్యక్షుడు కందుగుల సంగమయ్య, కార్యదర్శి కేవీ రావు, కోశాధికారి ఐలయ్య, కంటి దవాఖాన క్యాంపు కో ఆర్డినేటర్ అనిల్, అశోక్, టెక్నీషియన్ రఘు పాల్గొన్నారు.

## ప్రత్యేక గ్రీవెన్స్‌కు ఆరు విజ్ఞప్తులు

వినతులు స్వీకరిస్తున్న ఫీల్డ్ ఆఫీసర్ రవికృష్ణ

హనుమకొండ, జూన్ 22 : కలెక్టరేట్‌లో శనివారం దివ్యాంగుల కోసం నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌కు ఆరు అర్జీలు వచ్చినట్లు జిల్లా సంక్షేమాధికారి మధురిమ తెలిపారు. అంత్యోదయ కార్డులు, డబుల్ బెడ్ రూం ఇండ్లు, దివ్యాంగుల పెన్షన్ అంశాలపై వినతులు వచ్చాయన్నారు. వీటిని త్వరలోనే పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మాట్లాడుతున్న ఎస్సై కొంక అశోక్

దామెర, జూన్ 22 : మండలంలోని కోగిల్వాయిలో శనివ